

# సృష్టిలో అతి కష్టమైనది

అజ్జరపు హనుమంతరావు

ఆఫీసు టైమయింది .... సైకిలు మలుపు తిప్పానో, లేదో, భుక్తా యాసంతో రొప్పుతూ రాఘవరావు కనిపించాడు ....

"గురూ....విన్నావా!!" అన్నాడు. ఆత్రంగా...."ఏమిటి?" అన్నా, సైకిలు దిగి,

"స్వరాజ్యంవచ్చిందట....!"అన్నాడు, రహస్యం చెప్పినట్టువెంటనే. మర్మగర్భిత మైన నవ్వు....ఆ గారపట్టిన పళ్లుచూస్తే నాకు పరమ అసహ్యం.

"ఓహో...."అంటూనే సైకిలు ఎక్కేశాను. మధ్యాహ్నం యింటర్వెల్ సమయంలో యింటి కొచ్చినపుడు, "యిది విన్నావురా ఒబ్బాయ్?!" అంది మాఅమ్మ ఆశ్చర్యంగా-కాఫీకప్పు అందించి.

"ఏమిటది?" అన్నా కాఫీ సిప్ చేస్తూ. "స్వరాజ్యం వచ్చిందట....!!" అంది కళ్ళు పెద్దవిచేసి. చప్పిదవళ్ళు మరింత దగ్గరగా నొక్కుకుంటూ....

"వస్తేవచ్చిందిలే...." విసుగ్గా బయటికి కొచ్చేశాను. ఆఫీసులో పడితే మరేవిషయం ఆలోచించడానికి తీరికుండదు. నా సీటటువంటిది....

"యిహ నావల్ల కాదు బాబూ యీ చాకిరీ....కోడలుపిల్ల కొంప దిద్దుకుంటూ వుంటే హాయిగా రామా-కృష్ణాఅంటూ మూల కూర్చోవలసిన యీ వయసులో వండడం-వార్చడం....ఇహ ఆ రాత నాకు లేదు.... అర్ధరాత్రివేళ, అపరాత్రివేళ చక చకమంటూ లేచి తిరగడానికి నేనేం పిల్ల ముండని కనకనా!! ఏగడపో, కొయ్యో తగిలి తిరగబడి మూలబడితే యింత ముద్దపడేసే దిక్కులేదుకొంపలో...." అంటూ.... యిది రోజూనాకుమామూలె! నేనింకా పెళ్లిచేసుకోలేదనే కాని నిజంగారి లీఫ్ కోసం కాదావిడ తాపత్రయం!

"నేను పెట్టుకుతింటాలేవే' నువ్వు పడుకో...." నామామూలు డైలాగ్సు నేనూ అప్పజెప్పాను.

"సరేలే....పెట్టుకు తింటావ్ట.... అయినా నా ఏడుపు నాదే కాని నీకేంతెక్కలే...." అంటూ మౌనంగావంటింట్లోకి నడిచింది మా అమ్మ....

ఆవేశంలో మొదట ఏదో మాట్లాడేసినా రెండు క్షణాల్లోనే శాంతం సంతరించుకొంటుంది. "ఒరేయ్! అన్నట్టు తొమ్మిదో నెల కూడాను! ....అయినా దాన్నెవడే లుకుంటాళ్లే! అప్పుడే అనుకున్నాం"

కోపంగా చెయ్యి కడిగేసుకొని లేచి పోయాను, "అయ్యో .... అదేట్రా?!! ఎందుకూ అంత కోపం" యింకా ఏవో అంటోంది మా అమ్మ.... అదేం వినిపించకుండా నా రూములో కొచ్చి మంచంమీద పడ్డాను....

ఎంతగింజుకున్నా నిద్ర రావటంలేదు మనస్సు స్వరాజ్యంపయిపే దౌడు తీస్తోంది.... కళ్లెం వేయడం యిహ నా తరం కాలేదు! స్వరాజ్యం....!!

ఒకప్పుడు నన్ను గాఢంగా ప్రేమించింది,. జాలిపడి చేరదియ్యాలనుకుంది.... ఆ తర్వాత పూర్తిగా అసహ్యించుకుంది ....

నేనుమాత్రం ఎప్పుడూ నిర్లిప్తంగానే ఉండిపోయాను....

మా నాన్నంటే నాకు చచ్చే భయం! లేకపోతే- పెళ్ళీడువచ్చినపిల్ల 'నిన్ను [illegible]నాను' పెళ్ళి చేసుకుంటాను.... అని దగ్గఱగా వస్తే మౌనంగా వు[illegible], పీరుగారిపోయే చవటెవడేనా వుంటాడా?? నేను ప్రయత్నం చేశాను. కాని మానాన్న నన్ను పూర్తిగా డామినేట్ చేసి పారేశాడు.. "నీకేం సిగ్గులేదూ? దాన్ని పెళ్ళాడ్డవేంట్రా?? చెప్పినట్టు వింటే విను. లేకపోతే బయటికినడు...." అన్నాడు, కచ్చితంగా- ఒక్కగానొక్క నలుసునన్న కన్సెషన్ కూడాచూపించకుండా. అంతే!! నానోరిక పెగల్లేదు. మా నాన్న పోయి, నాపెద్దరికం వచ్చేసరికి స్వరాజ్యానికి పెళ్ళయి పోయింది....

మూడేళ్లు గడిచి నామనసు మనువు వేపు మొగ్గటం లేదు....స్వగతం స్వరాజ్యాన్ని మర్చిపోలేదు....ఎలా మర్చిపోతాను? రోజు కొకసారైనా మాఅమ్మే జ్ఞాపకం చేస్తూ వుంటే?!!

"పాపిష్టిది! బిడ్డ కేంమందుపెట్టిందో... పెళ్ళంటేనే పెడమొహం పెడుతున్నాడు...." అని స్వరాజ్యం నాకేకో మందు పెట్టిందని మా అమ్మ నమ్మకం.

అసలామాటకొస్తే నాకు స్వరాజ్యానికి పెళ్ళి కాక పోవడానికి కారణం పూర్తిగా స్వరాజ్యమే నంటాను!! చక్కనిది, చదువుకున్నది, ఆస్థి పరు రాలు అయినప పిల్లని ఎవడు మాత్రం కోడలుగా వద్దంటాడు? మానాన్న అన్నాడంటే ఒక విధంగా రైటే! మానాన్నంటే భయం కొద్దీ అంటున్నాననుకునేరు! (ఆయనిప్పుడెలాగూలేడని మీకు తెలుసుగా!!) లేక [illegible] ఒక హద్దు-పద్దుండాలి! స్వరాజ్యానికి రెండూ లేవు!! ఎదుకంటే వాళ్ళమ్మ చిన్నప్పుడే చచ్చిపోయింది. వాళ్ళ నాన్న, ముసలి మేనత్తగారాబంగా పెంచేశారు....

నా కంటె కొన్ని నెలలు చిన్నదేమో స్వరాజ్యం. మా యింటి పక్కల్లే వాళ్ళది. నాతోబాటే మొగపిల్లల వీధి బళ్ళోచదువుకునేది....ఎక్కువగా మొగ పిల్లలతోనే ఆడుకునేదికూడా!! నాకుచెడుగుడు ఆటంటే చెడ్డభయం! స్వరాజ్యం బ్రహ్మాండంగా ఆడుతుంటే కళ్లు పెద్దవిచేసి చూస్తూండే వాణ్ని! నా కాడ్డంరాదని వేళాకోళం చేసేది. నేను చిన్నబుచ్చుకునేసరికి మళ్ళా తనే జాలిపడి క్షమాపణ చెప్పుకుని, ఊరడించేది. అసలు స్వరాజ్యం లేకపోతే ఇప్పటికి నాకు సైకిలు తొక్కడం వచ్చి వుండేది కాదేమో!! తను నాకంటే ముందే నేర్చుకుందన్న పౌరుషం కొద్దీ నేనూ నేర్చుకున్నాను. అప్పట్లో స్వరాజ్యాన్ని అందరూ గడుగ్గాయి-దుడుకుపిల్ల - మొగరాయడు అంటూండేవారు. గౌనులు దగ్గర్నుంచి, పరికిణీ—చొక్కా సైతం మా యింట్లోనే 'అత్తయ్యా—అత్తయ్యా' అంటూ మా అమ్మ వెనకాతలే తిరిగేది.

మా అమ్మ కూడా 'ఏవేఁ కోతల పిల్లా' అని నాకు వరస కట్టేసి. నేను సిగ్గు పడి ముడుచుకు పోతే నా బుగ్గగిల్లి పారి పోయేది స్వరాజ్యం.

స్వరాజ్యం పైటలు ప్రారంభించింది. [illegible] కట్టింది. కాని చీకటి పడేవేళ కి యింటికి రావడం నేర్చుకోలేదు.

నాతో బాటే బియ్యేలో కొచ్చింది.... అయితే బాయ్ ఫ్రెండ్సు కూడా ఎక్కు వయ్యారు.

అన్నట్టు స్వరాజ్యం యింట ర్లోనే మా యింటికి రావటం మానేసింది.... మా అమ్మే మానిపించేసింది. తనని అత్తయ్యా అని పిలవద్దని కూడా కచ్చితంగా చెప్పే సింది మా అమ్మ. రహస్యంగా నేను వాళ్ళింటికి వెళ్లే వాణ్ని. వాళ్ళకి, మాకు మధ్య వున్న ప్రహారీగోడ ఎత్తు చేయించే వాడు మా నాన్న. అయినా డాబా మీద నుంచే మాట్లాడేది నాతో.... నేను రహ స్యంగా మాట్లాడినా తను మాత్రం గట్టి గానే మాట్లాడేది. మా వాళ్ళంటే తనకేం భయం?.... స్వరాజ్యంతో చాలా సినిమాల కెళ్ళే వాణ్ని నేను.... అసలు వచ్చిన చిక్కల్లా దంటే నాతోనే కాదు, చాలా మంది మగవాళ్ళతో సినిమాలకి, షికార్ల కి వెళ్ళేది, స్వరాజ్యం! చాలా మంది యింటి కొచ్చేవాళ్ళు వాళ్ళతో గంటలు తరబడి నవ్వుతూ మాట్లాడేది!

బియ్యే కంప్లీటయ్యేసరికి 'పచ్చి తిరుగు బోతు' అన్న కాంప్లిమెంటు కూడా సంపా దించింది స్వరాజ్యం!.... భార్య పోయిన తర్వాత వ్యాపారం తప్ప మరొక వ్యాపకం పెట్టుకోని స్వరాజ్యం నాన్న స్వరాజ్యానికి పూ రి స్వరాజ్యం [illegible] సంతోషం కాక్షించాడే తప్ప మరే ఇతర ఆంక్షలు పెట్టలేదు. కూతురి గురించి ఎన్నో విన్నా మిన్నకుండి పోయాడు. స్వరాజ్యం మాత్రం 'ఏడిశారు' ఎవరే మనుకుంటే నాకేం?' అనేది. మేనత్త ఎప్పుడేనా మందలిస్తే మందహాసం చేసి ఊరుకునేది.

నాకు వేరే సంబంధాలు రావడం మొద లెట్టాయి.

ఒక రోజు స్వరాజ్యం అంది, నాతో.

"రాజా.... నీకు సంబంధా లొస్తున్నా యని విన్నాను."

అవునని తలూపాను

ఆవేళ మేమిద్దరమే వున్నాం—ఆమె గదిలో.

"మరి నన్ను చేసుకోవా?" కొంటెగా చూస్తూ అంది.

నేను సిగ్గుపడి పోయాను.

"ఏయ్! అంత సిగ్గెందుకు? మరి మని ద్దరం ప్రేమించుకుంటున్నాంగా...." అంది మూతి ఆదోలా పెట్టి.

"అవును.... కాని మా అమ్మకి,నాన్నకి యిష్టం లేదు." అన్నా నెమ్మదిగా.

"ఆ సంగతి .నాకూ తెలుసు! కాని నాక్కావలసింది నీ ఉద్దేశం."




"నా కిష్టమే!....కాని...."

"కానీ....?" రెట్టించి, అడిగింది స్వరాజ్యం కాస్త సీరియస్‌గానే.

నాకు భయం వేసింది. కాని జవాబు చెప్పాలి లేకపోతే తిడుతుంది.

"నిన్ను చేసుకుంటే మా నాన్న యింట్లోంచి పొమ్మన్నాడు....అస్థిలో చిల్లి గవ్వ యివ్వనన్నాడు."

'మహారాజులా వచ్చెయ్! ఆస్థికేం? అంతకు పదిరెట్లు నా దగ్గరుందిగా...."

"అయితే నన్ను కొంటావన్న మాట...."

"ఓయ్....ఓయ్! నీలో పౌరుషం వచ్చిందే!!....అద్యరే! యింతకూ మీ వాళ్ళ కెందు కిష్టం లేదుట?"

"నిజంగా నీకు తెలీదా?"

"నీ నోటి మీదుగా విందామని...."

'నలుగురూ నీ గురించి చెడ్డగా చెప్పు కుంటున్నారు. అందుకని....'

"ఏమని చెప్పుకుంటున్నారు?"

నేను మాట్లాడలేదు.

"మాట్లాడవేం?" గట్టిగా అరిచింది స్వరాజ్యం.

అదరి పడ్డాను. శరీరం చెమటపట్టింది. గుండెలు దడదడ లాడేయి.

"అదే!! నువ్వు నలుగురితోటి విచ్చల విడిగా తిరుగుతావని.... యింకా....యింకా చాలా చాలా...." నెమ్మదిగా నసిగాను.

విపరీతమైన కోపంతో ఆమె ముఖం ఎరుపెక్కింది....కాని తమా యించు కుంది.

"ఐసీ!....నాతో తిరిగిన వాళ్ళలో నువ్వు కూడా వున్నావుగా! నీకూ నాకూ తప్పుడు సంబంధం ఏదయినా వుందా?"

"ఛీ ఛీ...."

"ఛి ఛీ కాదోయ్ నాగమ్మా! ఉందా అని?"

"లేదు"

"మరింకెవరికైనా నాతో వుందని నీ అభిప్రాయమా?"

"లేదు"

"అలాగని మనస్ఫూర్తిగా నమ్ముతున్నావా?"

"ఆఁ?"

"చిన్నప్పట్నుంచీ నా స్వభావం నీకు పూర్తిగా తెలుసు! నా దారి స్వచ్ఛమయింది అన్న నమ్మకం నాకున్నప్పుడు నేనెవర్ని లెక్కచెయ్యననీ నీకు తెలుసు! అవునా?"

"అవును"

"చిన్నప్పట్నుంచీ నిన్నే ప్రేమిస్తున్నానన్న విషయం తెలుసా?"

"కచ్చితంగా తెలియదు"

"పోనీ యివాళ నేను చెప్తే నమ్ముతావా?"

మాట్లాడలేదు నేను

బోనులో నుంచున్న ముద్దాయిలా వుంది నా పరిస్థితి!!

"ఏం? నమ్ముతావా?"

"నమ్ముతాను"

"కాని పెళ్ళాడలేవు. అవునా?"

"నాకు కొంత వ్యవధి కావాలి స్వరాజ్యం ఆలోచించుకోవి.."

"అనవసరం!! నువ్వేమీ ఆలోచించక్కర లేదు .. వెళ్ళిరా ఊఁ క్విక్"

చెమట తుడుచుకుంటూ బయటపడ్డాను. ఆ తర్వాత మా నాన్న దగ్గర మళ్ళీ స్వరాజ్యం సంగతెత్తి మోహం వాచేలా తిట్లు తిన్నాను.

స్వరాజ్యానికి కనిపించకుండా ముఖం తప్పించేశాను .. ఎటు తిరిగి స్వరాజ్యం మీదికే నా కోపం మళ్ళేది. అప్పుడే ఏంటి? యిప్పటికీని!! అందరు ఆడపిల్లలాగే తనూ ఎందుకుండ కూడదు? అణకువగా నమ్రతగా అచ్చం ఆడపిల్లలా. ఊహూఁ!! తన స్వభావం మార్చుకోదుట ఎవరూ అపార్థం చేసుకో కూడదుట!!.

ఒక్క విషయం మాత్రం నిజం! స్వరాజ్యం ఎంత స్వతంత్రంగా తిరిగినా చస్తే కాలుజారే మనిషి మాత్రం కాదు. ఒకసారి యివతలింటి మా క్లాస్‌మేటు గారపళ్ళ రాఘవరావుగాడు ఏదో అన్నాడు స్వరాజ్యాన్ని - అంతే! పళ్ళూడేలా గొట్టింది వాణ్ణి. అసలు స్వరాజ్యాన్ని గురించి చెడుగా ప్రాపగాండా చేసిందికూడ వాడే! వీధిలోవాళ్ళు సరేసరి. అదుగో పులి అంటే ఇదగో తోక అనే రకాలు.' ఇవన్నీ అపోహలు. 'మీరంతా తప్పు అభిప్రాయం పడుతున్నారు' అని నలుగురికి, ముఖ్యంగా మా నాన్నకి చెప్పే ధైర్యం నాకు లేదు. అలాగని తెగించి తనని పెళ్ళాడే ధమ్మూ లేదు....

మా నాన్న పోయి, నాకా ధైర్యం, తెగింపు వచ్చేసరికి పరిస్థితి చెయ్యిజారి పోయింది

స్వరాజ్యానికి పెళ్ళయిపోయింది!!!

అత్తారింటికి వెళ్ళిపోయేటప్పుడు నా క్కాబురంపింది. వెళ్ళాను ...

"రాజూ! నే మళ్లీ తిరిగొచ్చేసరికి నిజమైన మొగాడిలా నా ముందు నిలబడాలి, తెలిసిందా?" అంది నవ్వుతూ.

నేనేం మాట్లాడకుండా వచ్చేశాను.

అలా మూడేళ్ళక్రితం వెళ్ళిపోయిన మనిషి యిప్పుడే రావడం.

తొమ్మిదో నెలట ,

పురిటికొచ్చింది, యిందాక మా అమ్మ అన్నట్టు మొగుడు

ఛ ఛ! అలా జరిగుండదు. జరక్కూడదు. గారపళ్ల రాఘవరావు గూడా మధ్య ఏవేవో పేలాడు. స్వరాజ్యం మొగుడికి ఏం ఆకాశరామన్న ఉత్తరాలు రాశాడో!?

ఆలోచిస్తూ ఏ అర్ధరాత్రికో నాకు తెలియకుండానే నిద్రలో కొరిగాను.

మర్నాడాదివారం.

లేచేసరికి బాగా పొద్దెక్కింది.

తొమ్మిది గంటలయింది

స్నానం చేసి బజారుకని సైకిలు తీశాను. పెడలు మీద కాలుపెట్టి చూడకూడదనుకుంటూనే అప్రయత్నంగా పక్కింటి కిటికీ వయిపు చూశాను.

కిటికీ దగ్గర స్వరాజ్యం!!!

"మాట " అంది మామూలుగా

సైకిలు స్టాండువేసి అటువయిపు నడిచాను. తలుపు తీసి.

"మా నాన్నగారు-ఎక్కడికో వెళ్ళారు, మా అత్త ఊళ్లో లేదు నేనొక్కర్తినే వున్నాను. రావడానికేమైనా అభ్యంతరమా." అంది అదోలా నవ్వుతూ,

'మౌనంగా లోపలికినడిచాను.

కుర్చీలో కూర్చున్నాను.

"యిప్పుడే వస్తా కూచో " అంటూ లోపలి కెళ్ళింది స్వరాజ్యం

ఆమె వయిపే చూస్తూ కూర్చున్నాను,

బాగా లావయింది స్వరాజ్యం,అందులో నిండు చూలాలు! మనిషి యిదివరకే తెలుపు యిప్పుడు మరింత తెల్లబడి, మెరిసిపోతోంది ఇంకోలా చెప్పాలంటే యిదివరకటి కంటె చాలా అందంగా ఉంటప్పుడు. నా కంటె ఎంతో పెద్దవయిపోయినట్టనిపించింది.

"ఏమిటోయ్! అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు! నా గురించేనా?" కాఫీ కప్పుతో ప్రవేశిస్తూ నా ఆలోచనలకి బ్రేక్ వేసింది స్వరాజ్యం.

'అబ్బే అదేం లేదు చాలా మారిపోయారే మీరు "పెద్ద తలుపుగోడలా అన్నా నా మాటల్లో నాకే సహజత్వం కనిపించ లేదు

నా సంబోధనకి విస్తుపోయింది స్వరాజ్యం పక పకా నవ్వి.

"నన్ను మన్నిస్తున్నావా చిట్టి తండ్రీ, ఓహో!! మరొకరి భార్యననా??

నీకా భయం అక్కరలేదులే! ప్రస్తుతం నేను మామూలు మునపటిస్వరాజ్యాన్నే."

"అంటే?" అయోమయంగా అన్నాను

"అంటే— మా ఆయనకి నాకు యిక ఏ విధమైన సంబంధములేదు. విడాకు లిచ్చేశాను ." నవ్వుతూ అంది—ఎంతో సహజంగా.

నా తల తిరిగి పోయింది

"ఎందుకని?" అన్నా సీరియస్‌గా.

"ఆ మాత్రం వూహించ లేవూ? మన వీధి వాళ్ళ మహత్వం! మా ఆయనకి ఆకాశరామన్న ఉత్తరాలు రాశారు. ఆఅను మానవ్వక్షి యీ మూడేళ్ళు నన్ను వేపుకు తిన్నాడు. భరించలేక విడాకులులిచ్చేసి వచ్చేశాను " నేననుకున్నదేనిజం! ఒక్క నిట్టూర్పు విడవడం మినహానే నేమీ మాట్లాడ లేదు. మళ్లీతనే లంది.

"నా మాటకేంగాని, పెళ్ళి చేసుకోనని మొరాయిస్తున్నావుట ఏవిటి కధ " మామూలు ధోరణిలో అంది, వేళాకోళంగా.

"నీ కెవరు చెప్పారు?" ఎదురు ప్రశ్న వేశాను.

"ఇంకెవరు? నీ ఫ్రెండు! గారపళ్ళ రఘపరావుగాడు."

"నిన్నువాడెప్పుడు కలుసుకన్నాడు?"

"అబ్బో వాడి కధ చాలాబావుందిలే! ర్వాత జెబుతాను. అన్నట్టు పొద్దున్నే తలపు పూటా ఎక్కడికి బయలుదేరావు?" అంది. మాట మారుస్తూ.

"బజారుకి " ముక్తసరిగా అన్నాను.

"సరే! వెళ్ళిరా నీతో ఒకసారి మాట్లాడాలనిపించి పిలిచాను అంతే" అంది, ఇక చాలు వెళ్ళమన్నట్టు.మౌనంగా బయటికి నడిచాను.

* * *

నెల్లాళ్ళ కాంపు వెళ్ళి అవేళే తిరిగి వచ్చాను. పదిహేను రోజులక్రితం స్వరాజ్యానికి పురుడు రావటం! ఆడపిల్ల పుట్టి పోవడం కూడా జరిగాయట!! యిప్పుడు స్వరాజ్యం యింట్లోనే కులాసాగా తిరుగుతోందట!! నన్ను విపరీతంగా కదిలించి ఆశ్చర్య పరచిన తాజా వార్త మరొక్కటి స్వరాజ్యం గారపళ్ళ రాఘవరావు గాడ్ని పెళ్ళాడు తోందని!!

ఆ సాయంత్రం స్వరాజ్యం వాళ్ళింటి కెళ్ళాను. వాళ్ళ నాన్నగారా సమయంలో ఎక్కడికో వెళ్ళారు.

"వాట్ మిస్టర్ . రాజూ! ఏవిటి విశేషాలు? ఈ మధ్య వూళ్ళో లేవుట " అంది, స్వరాజ్యం ఎదురు వచ్చి

"అది సరే! మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నావుట?" అన్నా, ధైర్యంగా ...పిల్ల పోయి నందుకు సానుభూతి చెప్పాలని కూడా నా కినిపించలేదు.

"అప్పుడే పీదాకా వచ్చిందా?" వేళాకోళంగా అంది.

"నిజమేనా?" మళ్లీ అడిగాను.

"ఏం చేసుకోకూడదా?" సూటిగా చూస్తూ అంది, స్వరాజ్యం.

"లక్షణంగా చేసుకోవచ్చును! కాని వాడు తప్ప యింకెవడు దొరక లేదా?"

"ఏం? వాడికేం?? వాడు నా కోసం యిదివరకెన్నో ప్రయత్నాలు చేశాడు. ఆ సంగతి నీకూ తెలుసు! నా పెళ్ళయి పోయినా వాడి ప్రయత్నాలు మానలేదు మా ఆయనకి ఆకాశరామన్న ఉత్తరాలు రాశాడు. పది మందిచేత రాయించాడు ఈ వీధిలో వాళ్ల చాలా మంది వాడికింతో అంతా సహాయపడ్డారు కూడా!! యికపోతే నా విడాకుల కథనంలో వాడికీ చెప్పుకో తగ్గ పాత్ర వుంది! యిప్పటికే నా చుట్టూ కుక్కలా తినుగు తున్నాడు నేనంటే పడిచస్తాడు....వాడిలాంటి వాడు నా కింకెవడు దొరుకుతాడు చెప్పు? ఊఁ?'

"మరి మీ నాన్నగా రొప్పుకున్నారా ఈ పెళ్ళికి??"

"ఆయన నా మాటెప్పుడు కాదన్నారు?"

"కానీ ఒక్క విషయం స్వరాజ్యం! నీ మేలు కోరిన వాణ్ని కనక చెప్తున్నాను ఆ గారపళ్ళ రాఘవరావుగాడు అంతమంచి వాడు కాదు. వాడికి మొదట్నుంచీ నీ కంటె నీ ఆస్థి అంటేనే ఎక్కువ మక్కువ అన్నా ఆఖరికి.

"ఆ సంగతి నాకు తెలుసు మిస్టర్ శ్రేయోభిలాషి! కాని నా జీవితంలో నిప్పులు కురిపించిన వ్యక్తుల్ని అంత సులభంగా క్షమించి వొదిలెయ్యలేను నేను! ఓ పట్టు పట్టి చూస్తాను. రేపు పెళ్ళయిన తర్వాత నా భర్తగా వాడి బ్రతుకెలా వుంటుందో నువ్వే చూద్దువుగాని! వాడే కాదు లేనిపోని అపోహలు సృష్టించి నా కాపరంలో నిప్పులు పోసిన వ్యక్తులు చాలా మంది వున్నారీవూళ్లో ముఖ్యంగా యీ వీధి.. వాళ్ళందర్నీ కూడా ఒక చూపు చూడ దల్చుకున్నాను. నువ్వే చూస్తావుగా."

అంటూ సూటిగా నా వైపు చూసి, అంతలోనే కేర్‌లెస్‌గా కను బొమ్మ లెగరేసి గట్టిగా నవ్వింది స్వరాజ్యం.

ఈ సృష్టిలోకెల్లా అతి కష్టమైందేమిటయ్యా అంటే 'ఆడదాని అంతర్యం' అని ఎక్కడో చదివినట్టు గుర్తు,

స్వరాజ్యం కేసి అలాగే చూస్తూ కూర్చుండి పోయాను స్థాణువులా. •

